
లంచ్ అవర్ -

అంతా డైనింగ్ హాలుకి చేరుకున్నాం. క్యారేజీలు తెరచుకుని భోజనాలకు సిద్ధమయ్యాం. మా ఫ్యాక్టరీ ఎడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ పదిమందిలోనూ ఆ రోజు బుజ్జిబాబు తక్కువ. మా మధ్య బుజ్జిబాబు లేకపోవడం పెద్దవెలితే! ముఖ్యంగా భోజనాల సమయంలో బుజ్జిబాబు ఉంటే ఉండే ప్రత్యేకతే వేరు. అతని సమక్షంలో భోజనం చేయడం ఓ గొప్ప అనుభూతిగా భావిస్తాం. ఆ రోజు అతను లేకపోవడంతో సందడి లేకుండా సాదా - సీదా భోజనాల కార్యక్రమంలో పాల్గొన్నాం.

బుజ్జిబాబు మాలోకల్లా యువకుడు. వయసు ఇరవైఎనిమిది సంవత్సరాలు. కానీ మరో పదిసంవత్సరాలు పెద్దవాడిలా కనిపిస్తాడు. సం





వత్సరం క్రిందటే పెళ్ళయ్యింది. యింకా సంపాదన జంజాటం పెద్దగా లేదు. అతని అసలు పేరు 'బుచ్చిరామయ్య' అయినా మేమంతా ముద్దుగా 'బుజ్జిబాబు' అని పిలుచుకుంటాం. ఆకారానికి గున్నఏనుగులా ఉంటాడు.

'తిండిగలిగితే కండగలదోయ్! కండగల వాడేను మనిషోయ్!' అన్నట్టుగా బుజ్జిబాబు కండపుష్టి - తిండిపుష్టి దండిగా ఉన్న మనిషి. చీకూ-చింత లేని మనిషి. నవ్వుతూ-నవ్విస్తూ అందరితో సరదాగా వుంటాడు. పసిపిల్లవాడి మనస్తత్వం. ఆ లక్షణాలవల్ల అందరికీ అభిమాన పాత్రుడయ్యాడనుకుంటా.

ఇక తిండి విషయంలో బుజ్జిబాబు చూపించే ఆపేక్ష అంతా యింతా కాదు. రుచుల గురించి అతని నోటి నుంచే వినాలి. అయ్యరు హోటల్‌లో అల్లం, జీలకర్ర, నేతిపెసరట్టు, ఉప్మా కాంబినేషన్‌లో తింటూ ఉంటే ఎంత బావుంటుందో అతని నోటివెంట వింటే ఎవరైనా సరే అయ్యరు హోటల్‌కి పరుగుతీయవలసిందే! అలాగే అచ్చమ్మ పాకహోటల్‌లో పెసర పుణుకులు కారపుపొడి అద్దుకుని తింటే ఉండే కమ్మదనం, ఉడిపీ హోటల్‌లో కొబ్బరి చట్నీతో గారెల మాధుర్యం, ఇంకా సుబ్బయ్య హోటల్‌లో పుణుకుల పులుసు, గోంగూర పచ్చడి, కంది పొడి; వీరభద్రం బడ్డీ దగ్గర మషాళావడలు, చల్లపుణుకులు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద లిస్టే అవుతుంది. వాటి రుచులను బుజ్జిబాబు వర్ణించి చెబుతూంటే ఎదుటివారి నోటిలో లాలాజలం ఏరులైపారుతుంది.

బుజ్జిబాబు రుచులు వర్ణించి చెప్పడంతోనే సరిపెట్టకుండా వివిధ సందర్భాలలో వాటిని మాకు రుచి చూపిస్తూనే ఉన్నాడు. వాటిని తిని మేము బావున్నాయి అంటే తానే తిన్నంత ఆనందపడేవాడు. తనకు ఇష్టమైన లేదా అంతా బావుంటాయన్న పదార్థాలను ఎక్కడ నుంచైనా తెప్పించుకు మరీ తింటాడు. కలకత్తా నుంచి 'రసగుల్లాలు', మాడుగుల 'హల్వా', ఆత్రేయపురం 'పూతరేకులు', హైదరాబాదు నుంచి 'హలీమ్', తాపేశ్వరం కాజాలు అలా వివిధ ప్రాంతాల నుంచి కొరియర్ ద్వారాగానీ తెలిసినవాళ్ళు వస్తున్నా వాళ్ళద్వారాగానీ సేకరించి మరీ తింటాడు.

ఎప్పుడో మరచిపోయిన మట్టికుండతో పిడకలదాలిలో మరగకాసిన 'గుమ్మడికాయ దప్పళం', బలుసు ఆకులతో కాసిన తర్వాణీచారు, ఉలవచారు- వెన్నపూస వంటివి రుచిచూ

వి.వి. సుబ్బరాజు

సే అరుదైన అవకాశం మాకు కల్పించాడు.

ఇలా మమ్మలందర్నీ తన భక్తుల్నీ, తిండి భక్తుల్నీ చేసేసాడు. గతంలో భోజనం అంటే ఏదో తప్పనిసరి కార్యక్రమంగా భావించే నాకు భోజనం మీద ఆసక్తి పెరిగిపోయింది. కొత్తగా యిష్టాలు, రుచులు కావలసివస్తున్నాయి. నేను కూడా ఈ మధ్య కాస్త ఒళ్ళు చేసానట! మా శ్రీమతి చెప్పింది. నేను ఒక్కణ్ణే కాదు... మా స్టాఫ్ అంతా రుచులు చెప్పడంలో ఎక్స్‌ఫర్టులమయ్యాం. హిట్లరు లాంటి మా ఫ్యాక్టరీ పర్సనల్ ఆఫీసరుకి బుజ్జిబాబు ఏంపెట్టాడో తెలియదు. మమ్మల్ని తినడం మానేసి బుద్ధిగా తన తిండి తాను తింటున్నాడు.

ఈమధ్య మా బుజ్జిబాబు శ్రీమతి అతని భోజనప్రియత్వం మీద అడుగడుగునా ఆంక్షలు పెడుతోందట! ఆయిల్‌ఫుడ్, తీపి తగ్గించకపోతే కొలెస్ట్రాల్ పెరిగిపోతుందని, కారం, పులుపు, మషాళాలు తగ్గించకపోతే బి.పి., అల్సర్‌లు, హార్టు ట్రబుల్స్ వస్తాయనీ, తిన్న తిండికి సరిపడ శరీరశ్రమ లేకుంటే స్థూలకాయంతో బాటుగా షుగరు వస్తుందనీ, తిండి తగ్గించి వ్యాయామం చేయమనీ, యోగా చేయమనీ, వాకింగ్‌లు, జాగింగ్‌లూ చేయమనీ, బయట ఫుడ్ అసలు తినవద్దనీ రోజూ పోరుతోందట! బుజ్జిబాబు భార్య 'విమల' చదువుకున్నది, తెలివైనది, అందమైనది. బుజ్జిబాబు ఏరికోరి చేసుకున్న ఇల్లాలు.

బుజ్జిబాబు ఇంట్లో పరిస్థితి విన్నమీదట మేమంతా మా క్యారియర్లలో బుజ్జిబాబు కోసం ఓ వాటా కేటాయించడం ప్రారంభించాం - కుంతీదేవి భీముడికి వాటా కేటాయించినట్లుగా. ఎవరి ఇంట్లో ఏ వంటకం బావుంటుందో బుజ్జిబాబు చెప్పగలడు. శర్మగారి భార్య చేసే పులిహోర కమ్మదనం, ఆచారి ఇంట చక్కెరపొంగలి తియ్యదనం, నా శ్రీమతి చేసే బిర్యానీ ప్రావీణ్యం గురించి చక్కగా తెలుసు. బుజ్జిబాబు మెప్పుకోసం మా శ్రీమతులు తమ పాకశాస్త్ర ప్రావీణ్యం పోటీలుపడి మరీ ప్రదర్శించడం ప్రారంభించారు. మేమంతా పోటీలుపడి మా క్యారేజీలలో అదనపుభాగం కేటాయించి బుజ్జిబాబు చేత తినిపించి ఆనందపడుతున్నాం. ఇన్ని క్యారేజీలుతిన్నా ఓ గంట గడిసేసరికి క్యాంటిన్‌లోకి టిఫిన్‌కోసం పరుగులు పెడతాడు బుజ్జిబాబు. అతని జఠరాగ్నికి ఆశ్చర్యం కలుగుతుంది.


బుజ్జిబాబు సెలవు పెట్టాడట. కారణమేమిటో? మాకందరికీ అదోలా ఉంది. ఏదో భోజనాలు పూర్తి చేశాం. బుజ్జిబాబు తోడు లేని భోజనం భోజనంలా లేదు. మా క్యారేజీలన్నీ బరువుగా ప్రక్కన పెట్టాం.

వరుసగా వారం రోజులు బుజ్జిబాబు ఫ్యాక్టరీకి రాకపోయేసరికి కారణం ఏమైవుంటుందో తెలుసుకుందామని బుజ్జిబాబు ఇంటికి బయలుదేరాను.

బుజ్జిబాబు చిక్కి సగమైపోయాడు. గడ్డం పెరిగిపోయింది. కళ్ళు లోతుకుపోయాయి. గాలి తీసిన బెలూన్‌లా నీరసంగా ఉన్నాడు. నన్ను చూసి జీవం లేని నవ్వు నవ్వాడు.

"వంట్లో బావుండలేదా?" అన్నాను ఆత్రంగా దగ్గరకు వెడుతూ.

అతని కళ్ళ నుంచి నీళ్ళు ఉబికి వస్తున్నాయి. ఏదో చెప్పాలనుకొంటున్నాడు. చెప్పలేక పోతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ నిశ్చింతగా ఉండే బుజ్జిబాబు దిగులుగా ఉండడం, కళ్ళనీళ్ళు పెట్టడం నా మనసుని కలచివేసింది. "ఏమైంది! బుజ్జీ!" అన్నాను ఆప్యాయంగా భుజం మీద చెయ్యివేసి. బుజ్జిబాబు బరస్ట




యిపోయాడు. నెమ్మదిగా లేచి కప్‌బోర్డులోంచి ఓ లెటరు తీసుకువచ్చి నా ముందుంచి, చదవమన్నాడు.

శ్రీ బుచ్చిరామయ్యగారికి,

మీకు తిండి యావ తప్ప మరే విషయం పట్టదు. అది మీ ఆరోగ్యానికి మంచిదికాదని నేను పదే పదే చేసిన హెచ్చరికలు మీరు పట్టించుకోవడం లేదు. మితిమీరిన తిండివల్ల మీ ఆకారం ఎంత వికారంగా తయారయ్యిందో మీకు తెలియడంలేదు. మీతో కలిసి నలుగురిలోకీ వెళ్ళడానికీ నేనెంత సిగ్గుపడవలసివస్తున్నదో మీకు తెలియదు. నేను సిగ్గుపడేది మీ ఆకారానికి మాత్రమే కాదు. మీ ప్రవర్తనకు కూడా. మీతో సినిమాకు వెడితే మీరు చేసేది ఏమిటి? నన్ను హాల్లో ఒంటరిగా విడిచి, బయటకువెళ్ళి మిరపకాయబజ్జీలు, కారపుసెనగలు, పిడతకింద పప్పు, వేరుసెనగగుళ్ళు వంటి పొట్లాలు డజనుకు పైగా తెచ్చుకుని సినిమా పూర్తయ్యే వరకూ తింటూ కూర్చుంటారు.

అలానే ప్రయాణాల్లో కూడా నరకమే మీతో. అక్కడకు అమ్మకానికి వచ్చిన తేగలు, మొక్కజొన్న పొత్తులు, అరటి, జామ, బత్తాయి వంటి పళ్ళు, జంతికలు, చేగోడీలు, సమోసాలు వంటి చెత్త అంతా కొనేసి దిగేవరకూ తింటూనే ఉంటారు. తిండి ధ్యాస తప్ప మీకు మరోధ్యాస ఉండదు. చుట్టూ ఉన్న వాళ్ళంతా మిమ్మల్ని, మీ తిండినీ చూసి నవ్వుకొంటున్నా మీకు చీమ కుట్టినట్లు కూడా ఉండదు. మీ ప్రపంచమే వేరు.

ఈ మధ్య మీరు ఫ్యాక్టరీలో అందరి క్యారేజీలలో మిగుళ్ళు భోంచేస్తున్న విషయంకూడా తెలిసింది. మీకు ఎంత సిగ్గులేకుండా పోయిందో నాకు తెలియకుండా ఉంది.

పెళ్లికి ముందు నేను కన్న కలలన్నీ సంవత్సరకాలంలో కరిగిపోయాయి. మీలాంటి తిండి మనిషితో కాపురం చేయడం నా వల్ల కాదు.

ఈ రోజే మా పుట్టింటికి వెడుతున్నాను. నా చదువు నా పోషణకు సరిపోయే చిన్నపాటి ఉద్యోగం ఏదో ఒకటి కల్పించకపోదు. నా బ్రతుకు నేను బ్రతకడానికి నిర్ణయించుకున్నాను. మనం సామరస్యంగా విడిపోదాం.

దయచేసి ఏవిధమైన అభ్యంతరాలూ లేవనెత్తక మన విడాకులకు సహకరించగలరని విశ్వసిస్తున్నాను.

ఇట్లు
మిమ్మల్ని కట్టుకున్న నిర్భాగ్యురాలు
విమల

ఉత్తరం పూర్తిగా చదివి అవాక్కయ్యాను. బుజ్జిబాబు భోజనప్రియత్వం ఇంత విపరీత పరిణామాలకు దారితీస్తుందని నేను ఊహించ లేదు.

ఎదురుగా సర్వం పోగొట్టుకున్నవాడిలా దీనంగా కూర్చున్న బుజ్జిబాబు. అతనిని ఎలా ఊరడించాలో నాకర్థం కాలేదు. నన్ను సహాయం చేయమని ప్రాధేయపడ్డాడు. విమల కోసం పూర్తిగా భోజనం మానేయవలసి వచ్చినా వెను కాడనన్నాడు. ఎలాగైనా తన కాపురం నిలబెట్టమని కోరాడు.

బుజ్జిబాబుకి తిండికన్నా ప్రియమైన విషయం మరొకటి ఉందని తొలిసారిగా తెలిసి ఆశ్చర్యపడడం నా వంతయింది. బుజ్జిబాబు ఉన్న పరిస్థితికి, అతను ఇచ్చిన హామీమేరకు ప్రయత్నిస్తే వాళ్ళిద్దరినీ కలపవచ్చునన్న నమ్మకం కలిగింది. ఆ రోజే విమల వాళ్ళ ఊరు బయలుదేరాను.

బుజ్జిబాబు మామగారి ఇల్లు తేలికగానే పట్టుకున్నాను. వాకిట్లోనే విమల ఎదురుగా వచ్చింది. 'బావున్నారా? అన్నయ్యగారూ!" అంటూ. విమలతో బుజ్జిబాబు పరిస్థితి గురించి చెప్పాను. అతని నిర్ణయం గురించి కూడా చెప్పాను.

"నిజంగా ఆయనలో అంతమార్పు వచ్చిందా? అన్నయ్యగారూ!" అంది నమ్మలేనట్లుగా.

మొసలినోట ప[illegible] గజేంద్రుడిలా ఉన్న బుజ్జిబాబు పరిస్థితిని ఆమె కళ్ళకు కట్టినట్లు వివరించి, నా వెంటవచ్చి బుజ్జిని దక్కించుకోమని తొందరచేసాను.

విమల అందుకు అంగీకరించలేదు. ఓ షరతు పెట్టింది. బుజ్జిబాబుని ఏదైనా 'ప్రకృతి ఆశ్రమం'లో వెంటనే చేర్పించి, అతని వయసుకు, ఎత్తుకు ఎంత బరువు వుండాలో అంతే బరువు వుండేలా ట్రీట్‌మెంటు తీసుకుని బుజ్జిబాబు వస్తే తాను వెంట రావడానికి అభ్యంతరం లేదని ఖరాకండీగా తేల్చిచెప్పింది. ఎంతైనా తెలివైన ఇల్లాలు గదా! అదేచాలని నేను తిరిగి చక్కా వచ్చేసాను.

ఇప్పుడు బుజ్జిబాబు ప్రకృతి ఆశ్రమంలో ఉన్నాడు. అతని బరువు ఇంకా 20 కేజీలు తగ్గవలసి ఉంది. అతని ఏకైక లక్ష్యం విమలే గనుక ఆ బరువు నుంచి అతను తేలికగా బయటపడతాడని నా నమ్మకం. భర్తను అదుపుచెయ్యగలిగిన విమల తెగువకు లోలోపలే అభినందించాను. ఇంటికి ఇల్లాలి పొదుపేకాదు అదుపు కూడా ఉండాలి! ఏమంటారు!? ●

అప్పారావు షేవింగ్ చేయించుకోవడానికి సెలూన్‌కి వెళ్లాడు. "మీరెంతమంది అన్నదమ్ములు సార్?" అడిగాడు బార్బర్ షేవింగ్ చేస్తూ.

"నువ్వు ఇప్పుడు నాకు సరిగ్గా షేవింగ్ చేస్తే ముగ్గురం. లేకపోతే ఇద్దరే". టక్కున సమాధానం ఇచ్చాడు అప్పారావు.